మహిళా సాధికారతకు కృషి

- జగనన్నకు అక్కాచెల్లెమ్మలు అండగా నిలవాలి
- మహిళలకు అనేక సంక్షేమ పథకాలు
- మంత్రి జోగి రమేష్



పెనమలూరులో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పెనమలూరు గ్రామంలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకం కింద 6,485 మంది డ్వాక్రా మహిళలకు రూ. 5.19 కోట్లు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తర్వాత మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారికి పెద్ద పీత వేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా, అమ్మఒడి, చేయూత, ఇళ్ల స్థలాల పంపిణీ.. ఇలా ప్రతీ సంక్షేమ పథకం మహిళల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, దీని ద్వారా సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి జగనన్న ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదవడమే కాకుండా కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందజేస్తున్నామని పేర్కొన్నారు. నేడు వైద్యం క్షేత్రస్థాయిలో అందరికీ అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, రూ. 25 లక్షల పరిమితికి ఆరోగ్యశ్రీ పెంచారని వెల్లడించారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో సుపరిపాలనను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్ మాత్రమే అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి..

రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. ప్రజల కష్టాలను పట్టించుకోని తోడు దొంగలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఓట్ల కోసం మొసలి కన్నీరు కార్చుతున్నారని ఆరోపించారు. పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదివితే అసత్య ప్రచారం చేసి విషం కక్కారని, గూడులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే కోర్టు కేసులు వేయించారని విమర్శించారు. ప్రజలకు తోడుగా ఉన్న వలంటీర్లను తొలగిస్తామని, సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని ప్రకటించి ఎన్నికలు వచ్చే సరికి మాట మార్చిన మహాఘనుడు చంద్రబాబు అని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలన్నా, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నా తిరిగి జగనన్నను సీఎం చేయాలని కోరారు. అనంతరం సభలో తమ్ము జాగృతి చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీడీఓ కుమార్ బాబు, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, సర్పంచ్‌లు సంగెపు శ్రీనివాసరావు, కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, చక్క విజయ, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు కొల్లపల్లి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు పీ రాఘవరావు, బిందుమాధవి, రామినేని రమాదేవి, నేతలు అక్బర్‌పాషా, పోలవరపు రవి, కొడాలి సుష్మా, చక్క గోపి, శీలం శ్రీరాములు, గురుప్రసాద్, తెన్నేటి ప్రకాష్, మాదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆసరా మహోత్సవానికి హాజరైన మహిళలు

ఆర్టీసీ కార్మికులకు అండగా ప్రభుత్వం



గన్నవరం డిపో ప్రాంగణంలో మొక్క నాటుతున్న జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్

గన్నవరం: ఆర్టీసీ కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాల అండగా నిలుస్తుందని ఆ సంస్థ జోనల్ చైర్మన్, బోర్డు డైరెక్టర్ పిన్నెంటి మహేష్ పేర్కొన్నారు. స్థానిక గన్నవరం ఆర్టీసీ డిపోను గురువారం ఆయన సందర్శించారు. తొలుత చైర్మన్‌కు డీఎం పీ శివాజీ, అసోసియేషన్ నేతలు, కార్మికులు స్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్‌ను పరిశీలించిన ఆయన ప్రయాణికులతో మాట్లాడి బస్ సర్వీస్‌లు, సదుపాయల గురించి ఆరా తీశారు. మేకా విజయలక్ష్మీ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రవికుమార్ సౌజన్యంతో ఆధునీకరించిన సెక్యూరిటీ రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జోనల్ చైర్మన్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపేందుకు అందరూ సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను బోర్డులో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌ను అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. పర్యటనలో భాగంగా ఆయన డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారిణి వాణిశ్రీ, వివిధ అసోసియేషన్ల నేతలు బీ సంజీవ్, టీవీ కోటేశ్వరరావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ గురువారం పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగి నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసి, వచ్చే నెల మొదటి వారంలో బస్‌స్టేషన్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సుమారు 1.30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 4.40 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తున్నట్లు జోనల్ చైర్మన్ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వాణిశ్రీ, డీఈ సురేంద్ర, విజిలెన్స్ అధికారి ఎండీ యాసీన్‌షరీఫ్, హనుమాన్‌జంక్షన్ బస్టాండ్ కంట్రోలర్ శేఖర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ హాల్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులో రూ. 40 లక్షలతో ఆధునీకరించిన లయన్స్ క్లబ్ హాల్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ చేతుల మీదగా గురువారం ప్రారంభించారు. సెంట్రల్ ఏసీ, జనరేటర్ సదుపాయాలతో పాటు ప్రత్యేక గదులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హాల్ ఆధునీకరణకు విరాళాలు అందించిన దాతలను దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం, సీనియర్ సభ్యులు మేడికొండ బుచ్చిబాపయ్య, నండూరు సత్యవెంకటేశ్వరశర్మ, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ట్రస్ట్ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు(స్వామి), కార్యదర్శి గూడవల్లి రత్నశేఖర్, క్లబ్ కోశాధికారి క్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పోరంకిలో రథసప్తమి పూజలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భవానీశంకర సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు గురువారం వివరాలు తెలుపుతూ రాష్ట్రంలో రెండవ సూర్య దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన ఆలయంలో శుక్రవారం ఉదయం 3 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, స్వామివారికి విశేష అలంకరణ, 11 గంటలకు ఉషాఛాయా సమేత సవిత్ర సూర్యనారాయణ స్వామివారికి దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ ఆసరా పథకం ఆదుకుంది



అంబాపురం(విజయవాడరూరల్): రెక్కాడితేకాని డొక్కాడని పేద కుటుంబం మాది. బ్యాంక్‌లో తీసుకున్న రుణం తిరిగి చెల్లించడంలో ఇబ్బంది పడుతున్న నాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా కుటుంబాన్ని ఆదుకుంది. అంబాపురం గ్రామంలో ఆశాజ్యోతి గ్రామైఖ్య సంఘంలో ఇందిరా గ్రూపుకు వైఎస్సార్ ఆసరా పథకంలో 3 లక్షల 61 వేల 437 రూపాయలు వచ్చాయి. నాలుగు దఫాలుగా 90 వేల 360 రూపాయల చొప్పున రావడం జరిగింది. బ్యాంకు అప్పు తీర్చుకోవడంతో పాటు పాడిగేదెలను కొనుగోలు చేసి పాల వ్యాపారం చేసుకొంటున్నాను. మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసుకొంటున్నాను. మళ్లీ అధికారంలోకి జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాను.

దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విజయవాడరూరల్: ఫారం-6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని విజయవాడరూరల్ మండల తహసీల్దార్, ఏఈఆర్వో పి.జాహ్నవి హెచ్చరించారు. విజయవాడరూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్‌స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం అందరూ తమ తమ విధులను నిర్వర్తించాల్సిందేనని పేర్కొన్నారు. జాప్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మండలంలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు.

ఢిల్లీ సరిహద్దులో రైతులపై ఆంక్షలు ఎత్తివేయాలి

గన్నవరం: ఢిల్లీ సరిహద్దుల్లో రైతులను అడ్డుకునే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని ఏపీ కౌలుదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పీ హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. దీనికి నిరసనగా ఆందోళనకు దిగిన రైతులను ఢిల్లీ సరిహద్దుల్లో అడ్డుకుని బాష్పవాయువును ప్రయోగించడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రం స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా అటకెక్కించిందని విమర్శించారు. సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఏపీ రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి



ఉంగుటూరు: విద్యార్థి దశ నుంచే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు అన్నారు. నారయ్య అప్పారావుపేటలో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీహరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పట్టుదలతో విద్యనభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం 52 మంది ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్ నాగరాజు, హెచ్ఎం జే దుర్గ, కేవీ నాగబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నున్నలో జగనన్న ఆరోగ్య సురక్ష

నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలో శుక్రవారం సచివాలయం-2 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఉయ్యూరు సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ బాషా, ఎస్సై గణేష్‌కుమార్

ఉయ్యూరు: చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. ఉయ్యూరు సెంటర్‌లో గురువారం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. నిబంధనలను అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ బాషా మాట్లాడుతూ వాహనదారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తనిఖీల్లో ఎస్సై గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శృతిలయ సమ్మేళనం.. వీణావాద్య సమ్మోహనం



త్యాగరాజ స్వామి పంచరత్న కృతులను వీణపై పలికిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో గురువారం నిర్వహించిన అఖండ వీణా సంగీత సమ్మేళనం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కృతులను వీణపై పలికించారు. కార్యక్రమంలో వీణా విద్వాంసులు కేఎస్ గోవిందరాజన్, అయ్యగారి సత్యప్రసాద్, చిట్టా కార్తీక్, కొండా శశిధర్, శిష్టు గౌరీ శంకర శాస్త్రి, ఈమని మహతి, చింతలపాటి ప్రజవి, రావూరి గాయత్రి, లక్ష్మీ వైష్ణవి పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై నిర్విరామంగా 12 గంటలసేపు సాగింది. కార్యక్రమాలను డాక్టర్ వై. రాఘవేంద్రరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాలని అందుకు కృషి చేస్తున్న సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి వారి కృషిని అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.

సుగంధాలతోనే జీవనోపాధి



ప్రత్యేక వేషధారణలో ఫిరోజ్

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో విజయవాడ పటమటలంక ప్రాంతానికి చెందిన ఎండీ ఫిరోజ్(60) వినూత్నంగా ఆకర్షిస్తూ సుగంధ ద్రవ్యాలు(పరిమళ ద్రవ్యాలు) విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రత్యేక వేషధారణతో చేతిలో మైక్, సినిమా పాటలతో ప్రచారం చేస్తూ అందరిని ఆకర్షిస్తూ సెంట్ బాటిళ్లు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నాడు. తన కుటుంబంలో తరతరాలుగా సెంట్ అమ్మకాలు చేస్తున్నామని ఫిరోజ్ చెప్పారు. గల్ఫ్ నుంచి తీసుకువచ్చే సెంట్ బాటిళ్లు విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న శ్రీసీతా లక్ష్మణ సమేత భద్రాద్రి రామచంద్రస్వామి గుహాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తాంజనేయ, సువర్ణ గరుడస్వామి, జయ, విజయల విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్టించారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్టల అనంతరం పూర్ణాహుతి సమర్పించి స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఆలయ సేవా సమితి ఏర్పాట్లను పర్యవేక్షించింది.


కళా సంస్థలు కళాకారులకు వేదిక కల్పించాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల ప్రదర్శనకు వేదిక కల్పించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం మెరిసే మేఘమాలిక పేరుతో సినీ సంగీత విభావరి, గుంటూరుకు చెందిన కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు తమ సంస్థ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. నిర్వాహకులు తొట్టెంపూడి రమేష్‌ను ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం పలువురు గాయకులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఉయ్యూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై గురువారం చైల్డ్ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండీ ఇస్మాయిల్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, దీనవాహి ప్రసాద్, అబ్దుల్‌హసన్ పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పోలీసులు గురువారం పరిశీలించారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెరికీడు, కానుమోలు, ఆరుగొలను, బాపులపాడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఐ అల్లు నవీన్‌నరసింహమూర్తి, ఎస్సైలు ఏడీఎల్ జనార్ధన్, పీ ఆర్జమ్మలతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, వసతి సదుపాయాలు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్నట్లు సీఐ నరసింహమూర్తి తెలిపారు.

నెరవేరిన సొంతింటి కల

- గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



ఆత్కూరులో జగనన్న కాలనీ

ఉంగుటూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు సంక్షేమ నవ శకానికి నాంది పలికాయి. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నిలువ నీడ లేకుండా పేదలు పడుతున్న దుర్భర పరిస్థితులను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టారు. లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అంతేకాకుండా ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుతూ ఇళ్లు నిర్మించుకోవడానికి తోడ్పాటును అందించారు. దీంతో పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుంచి నిరుపేదలకు ఉపశమనం లభించింది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకున్నాయి.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు..

మండలంలో 30 లేఅవుట్లు 2,294 మంది లబ్ధిదారులు ఉన్నారు. అదే విధంగా సొంత స్థలాలు ఉన్న 540 మందికి రుణాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు, జగనన్న కాలనీల్లో 780 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆశల సౌధాలు రూపుదిద్దుకోవడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుకున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మూడు విడతలుగా అందిస్తోంది. బేస్‌మెంట్, రూఫ్‌లెవల్, శ్లాబ్ ఇలా దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తోంది. ప్రభుత్వం తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాల కల్పనకు చొరవ చూపుతోంది.

అద్దె కష్టాలు తీరాయి..



అద్దె ఇళ్లలో ఇంటి అద్దెలు కట్టలేక చాలా ఇబ్బందులు పడే వాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సొంతిల్లు లేదనే బెంగ తీరింది. జగనన్న కాలనీలో ఇంటి స్థలం రావడంతో మానికొండ లేఅవుటులో ఇల్లు నిర్మించుకున్నాం. – నాన్నెపాము జోసేలు, తేలప్రోలు

జగనన్నకు రుణపడి ఉంటాం..



సీఎం జగనన్న నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. జగనన్న కాలనీలో స్థలం కేటాయించడంతో పక్కా గృహం నిర్మించుకున్నాం. సొంతింటిలో ఉండే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. – ముగడ లక్ష్మి, తేలప్రోలు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



ఉయ్యూరు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత అని రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని కాటూరు, ఉయ్యూరు శివారు నాగన్నగూడెంలో ఇటీవల ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదాల్లో పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు ఈపూరి బుజ్జి, నిమ్మగడ్డ మరియమ్మలను గురువారం పడమట స్నిగ్ధ పరామర్శించి నిత్యావసరాలు, వంట సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంజా సుధాకర్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆమెపై దాడి చేసిన పలువురు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు చలసానినగర్ 3వ లైన్‌కు చెందిన టి.దుర్గాభవాని గత కొద్ది సంవత్సరాల క్రితం భర్త నుంచి విడిపోయి ఉంటుంది. ఆమెకు ఒక స్నేహితురాలి ద్వారా జి.శ్రీనివాసరావు పరిచయమయ్యాడు. అతను చిట్టీల వ్యాపారం చేస్తాడు. దుర్గాభవాని శ్రీనివాసరావు వద్ద చిట్టీలు వేస్తూ రూ. 3 లక్షలు అప్పుగా తీసుకుంది. ప్రతీ నెల వడ్డీ చెల్లిస్తుంది. కాగా శ్రీనివాసరావు రాత్రి సమయాల్లో దుర్గాభవానికి ఫోన్ చేసి అసభ్యంగా ప్రవర్తించసాగాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆమె ఇంటికి శ్రీనివాసరావు, మరికొందరు వ్యక్తులు వచ్చి ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

నా క్లైంట్ అయిన కృష్ణాజిల్లా, పెనమలూరు గ్రామ వాస్తవ్యులు మలెంపాటి రామ కోటేశ్వరరావు గారి కుమారుడు మలెంపాటి రామశేషు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ఎన్.టి.ఆర్ జిల్లా నున్న గ్రామానికి చెందిన గుడిపూడి వెంకట నరసింహాచార్యులు గారి భార్య గుడిపూడి గాయత్రీ దేవి గారికి తన మేనమామ గారైన ప్రత్తి వెంకట బ్రహ్మానంద రావు గారి స్వార్జితమై ఉండి ఆయన సంపూర్ణ హక్కులతో అనుభవించుచు 2010వ సంవత్సరంలో సదరు షెడ్యూలు ఆస్తిని పై తెలిపిన గుడిపూడి గాయత్రీ దేవి గారికి తన తదనంతరం సంక్రమింపజేస్తూ ఒక వీలునామా వ్రాయించి, సదరాస్తికి సంబంధించిన యావత్తు దస్తావేజులను గుడిపూడి గాయత్రిదేవి గారికి అందచేసి యుండి 2014వ సంవత్సరంలో కాలంచేసినారు. సదరు వెంకట బ్రహ్మానంద రావు గారి తదనంతరం వారి యొక్క వీలునామా ప్రకారం దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని గుడిపూడి గాయత్రి దేవి గారు స్వాధీనం చేసుకొని సంపూర్ణ హక్కులతో అనుభవించు చున్నారు. అట్టి పరిస్థితులలో గుడిపూడి గాయత్రీ దేవి గారు తమ అవసరాల నిమిత్తం దిగువ షెడ్యూలు ఆస్తిని అమ్మకమునకు పెట్టగా నా క్లైంటు సదరు ఆస్తిని కొనదలచి కొంత నగదును అడ్వాన్సుగా చెల్లించి విక్రయ ఖరారు అగ్రిమెంట్ పొంది ఉన్నారు. మరియు మిగిలిన క్రయ ధనమును త్వరలో చెల్లించి సక్రమమైన రిజిస్ట్రేషన్ పొందుటకు సిద్ధమవుచున్నారు. సదరు ఆస్తిపై ఎవరికైనను ఏ విధమైన హక్కులు, బాకీలు, తనఖాలు, క్రయములు మరియు దావా తగాయిదాలు ఉన్నచో ఇప్పటినుండి పది రోజులలోపు మాకు స్వయంగా గాని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని తెలియచేయగలరు. అటు పిమ్మట సదరాస్తిని నిర్వివాదమైనదిగా భావించి సదరు ఆస్తిపై నా క్లైంట్ రిజిస్ట్రేషన్ పొందగలరు అటు పిమ్మట చేసే క్లైములు వగైరాలు నా క్లైంట్ ను బైండ్ చేయజాలవు.

షెడ్యూలు : కృష్ణాజిల్లా విజయవాడ సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా కానూరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన కానూరు గ్రామం తాలూకు రీ.సర్వే.నెం. 8/2 దాఖలా 402.08 చ.గ స్థిరాస్తి మేరకు భూమి ఆస్తికి హద్దులు : తూర్పు : 33 అ. పంచాయతీ రోడ్డు, దక్షిణం : పరుచూరి శోభారాణి గారి భూమి, పడమర : పర్వతనేని వెంకటరత్నం గారి భూమి, ఉత్తరం : తూనుగుంట్ల, సాంబశివరావు గారి భూమి.

ఎస్. బాలాజీ, అడ్వకేట్, డోర్ నెం. 26-20-21ఎ, స్వామి వీధి, గాంధీనగరం, విజయవాడ-3. ఫోన్ : 83338 64459

కార్మికులకు ఆప్కాస్ ద్వారా వేతనాలు చెల్లించాలి

గన్నవరం: ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కాస్) ద్వారా చెల్లించాలని ఎస్ఎంయూ అసోసియేషన్ కృష్ణా రీజియన్ అధ్యక్షుడు బీ నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక డిపోను సందర్శించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సకాలంలో వేతనాలు పొందేందుకు ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌కు అనుసంధానం చేయాలని కోరారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

కంకిపాడు: మైనర్లు వాహనాలు నడిపినా, వారికి వాహనాలు ఇచ్చినా చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్సై డీ సందీప్ హెచ్చరించారు. కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వాహనాలు నడుపుతున్న మైనర్లను, వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి బుధవారం రాత్రి కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రమాదాలు అధికంగా జరిగేందుకు ఆస్కారం ఉందని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని, పోలీసు ఆదేశాలు బేఖాతరు చేస్తే వాహనాలు ఇచ్చిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.